క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు, పెనుగుదురుపాడు, యడ్లపల్లి ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: 33కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రేపల్లె పట్టణం, రూరల్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమూరు: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పెరవలిలో మరమ్మతుల పనులు చేపట్టడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఆయన తలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొల్లూరు : విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిలుమూరు, ఈపూరులంక సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీరువా బహూకరణ

నిజాంపట్నం: నిజాంపట్నం మండల విద్యావనరుల కేంద్రంకు ఉపాధ్యాయులు శుక్రవారం బీరువాను బహూకరించారు. గుండుబోయిన సావిత్రమ్మ, సత్యనారాయణల జ్ఞాపకార్థం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి కుమార్తె, అల్లుడు రాజ్యలక్ష్మి–కిరణ్‌లు బీరువాను మండల విద్యాశాఖ అధికారి శేషుగోపాలంకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఎంఈవో శేషుగోపాలం అభినందనలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

రేపల్లె రూరల్: ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో గుంటి సాంబశివరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు, కార్యాలయ సిబ్బందికి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు గరికపాటి వెంకటేశ్వరరావు, ఏజెంట్లు బసవరాజు, పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి వై.కిషోర్ బాబు, అధ్యక్షుడు బీవీ మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హరిహర సుతునికి పూజలు



నగరం: స్వామియే.. అయ్యప్పో.. అంటూ అయ్యప్ప నామస్మరణతో నగరంలో శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణం మార్మోగింది. హరిహర సుతుని జన్మదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలను గురుస్వాములు కనుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. పడిపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు నగరం పురవీధులలో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్యాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వెల్లటూరు ఉపాధ్యాయుడికి అబ్దుల్ కలాం అవార్డు



భట్టిప్రోలు (కొల్లూరు) : కృష్ణా నదీ వరదల సమయంలో లంక గ్రామాలలో విద్యార్థులకు చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా వెల్లటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ కృతి ఫౌండేషన్ అబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న అవార్డుకు ఎంపికై నట్లు పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. ఆయన చేసిన సేవలకు గాను ఈ అవార్డును 13న చీరాలలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ సమీపంలోని రోటరీ క్లబ్‌లో ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. అవార్డుకు ఎంపికైన మురళీమోహన్‌కు పాఠశాల ఉపాధ్యాయులు అరుణకుమారి, వాకా హరిప్రసాద్, కుర్ర రామారావు, ఎస్టేట్‌బాబు, కుటుంబరావులు అభినందనలు తెలియజేశారు.

మహాత్మా పూలే జీవితం యువతకు ఆదర్శం

- ఆర్డీవో నేలపు రామలక్ష్మి
- వాడవాడలా ఘనంగా పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: విద్యతోనే సమాజంలోని అసమానతలను జయించటం సాధ్యమవుతుందని నమ్మి ఆ దిశగా వెనుబడిన జాతులను జాగృతం చేసిన మహత్మ పూలే జీవితం నేటి యువతకు ఆదర్శమని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. పూలే జయంతి సందర్భంగా పట్టణ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో...

మహత్మ జ్యోతిరావు పూలే జయంతిని పట్టణ సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం నిషేధం, బాలికా విద్యకు పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, నాయకులు వై.కిషోర్, కే.ఆశీర్వాదం, దానియేలు, యు.నాంచారయ్య, వై.నవీన్ పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయంలో...

మహత్మ పూలే జయంతిని పట్టణ హెడ్‌పోస్టాఫీస్ కార్యాలయ ఆవరణలో పోస్టల్ ఎంప్లాయీస్ తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సిబ్బంది పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ వెంకట స్వామి, తెనాలి డివిజన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సభ్యులు నారాయణ, అభిలాష్, నరేంద్రగోపీ, రవిప్రసాద్, దివ్య, దీప్తి, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): పూలే సంస్కరణలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొటిపాటి పూర్ణకుమారి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: స్త్రీ శక్తిని వెలుగులోకి తీసుకువచ్చిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని తహసీల్దారు సుశీల అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల కోసం చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్రబాబు, ఆర్ఐ సాయి, వీఆర్వో జితేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పునరుజ్జీవోద్యమ పితామహుడు పూలే

బాపట్లటౌన్: పునరుజ్జీవోద్యమ పితామహుడు జ్యోతిరావు పూలే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య తెలిపారు. పూలే జయంతిను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. చల్లా రామయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడిన యోధుడు పూలే అన్నారు. కార్యక్రమంలో బాపట్ల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మరుప్రోలు కొండలరెడ్డి, బీసీ సీనియర్ నాయకుడు సాయిల మురళీ, తన్నీరు అంకమ్మ రావు, మోర్ల సముద్రాలు గౌడ్, బాపట్ల ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు జోగి రాజా, మన్నెం పాపారావు, మైనారిటీ నాయకుడు షేక్ సుభానీ, బాపట్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు ప్రకాష్, బాపట్ల సోషల్ మీడియా అధ్యక్షుడు అడే చందు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

బీసీల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన పూలే చిరస్మరణీయుడని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ తెలిపారు. పూలే జయంతిని పురస్కరించుకొని చీలురోడ్డులోని ఆయన విగ్రహానికి, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, మహిళా అధ్యక్షురాలు కంకణాల బాలమ్మ, కె.రాంబాబు, ప్రత్తిపాటి సాయి, కృష్ణ చైతన్య, సుబ్బారావు, మహేష్, మారుతి పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో...

పట్టణంలోని మేధ కళాశాల ఆవరణలో సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం పట్టణంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ ఉపాధ్యక్షుడు బాజీ వలి, కార్యదర్శి అబ్దుల్ కరీం, సమాజవాదీ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేసిన మహనీయుడు

రేపల్లె రూరల్: మహిళా సాధికారతకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజక సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మహాత్మ పూలే జయంతిని చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, బాపట్ల జిల్లా కార్యదర్శి సాంబశివారెడ్డి, నాయకులు గాలి మోతు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

స్త్రీ శక్తిని వెలికితీసిన మహోన్నతుడు పూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి, నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు) : స్త్రీ శక్తిని వెలికితీసిన మహోన్నతమైన వ్యక్తి జ్యోతిరావు పూలే అని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం భట్టిప్రోలులో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను పనిచేసే యంత్రాలుగా అణగదొక్కుతున్న తరుణంలో స్త్రీలను విద్యావంతులుగా మార్చడం కోసం ఆయన నిర్విరామంగా పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో తొలుత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పూలే జయంతి కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తహసీల్దారు సుశీల

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు


బాపట్లటౌన్: కర్లపాలెం మండలం నర్రావారిపాలెం గ్రామంలో హోరాహోరీగా సాగిన కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా కర్లపాలెం ఎంపీపీ యారం వనజ పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు చాంపియన్ షిప్, బహుమతులను అందజేశారు. యారం వనజ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. చిన్న పులుగువారిపాలెం జట్టు నర్రావారిపాలెం జట్టుపై 4 పరుగుల తేడాతో విజయం సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో రన్నర్‌గా నర్రావారిపాలెం జట్టు నిలిచింది. ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో విజయం చిన పులుగువారిపాలెం జట్టును వరించింది. మూడవ బహుమతిని పేరలి జట్టు సాధించింది. ఈ టోర్నమెంట్లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఆట్ల ఉర్లరెడ్డి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పేరలికి చెందిన జోసెఫ్, బెస్ట్ బౌలర్‌గా శశి, బెస్ట్ ఆల్ రౌండర్‌గా యల్లావుల వంశీకృష్ణకు వ్యక్తిగత బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిని ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్, రెండవ బహుమతిని మార్పు బెనర్జీ, మూడో బహుమతి యల్లావుల శ్రీనివాస రావు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, పిట్టలవానిపాలెం కన్వీనర్ లీల శ్రీనివాస్ రెడ్డి, బండ్లమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మార్పు బెనర్జీ, మార్పు రత్నం పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న చిన పులుగువారిపాలెం జట్టు

రామమందిరాన్ని కూల్చొద్దంటూ మహిళల నిరసన

రేపల్లె రూరల్: గుడిని కూల్చొద్దంటూ పట్టణంలోని 10వ వార్డులో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఓపెన్ థియేటర్ వెనుకవైపు రచ్చబండపై ఇటీవల వార్డు వాసులు సీతారాముల విగ్రహాల ఏర్పాటుకు చిన్నపాటి మందిరాన్ని నిర్మించి అందులో విగ్రహాలను నెలకొల్పుకున్నారు. అయితే మున్సిపాలిటీ స్థలంలో అనుమతులు లేకుండా ఎటువంటి కట్టడాలు నిర్మించరాదంటూ మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం మందిరాన్ని పడగొట్టేందుకు అక్కడికి చేరుకున్నారు. దీంతో కాలనీ వాసులు అధికారులను అడ్డుకుని మందిరాన్ని పడగొట్టరాదంటూ మందిరం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ప్రతి ఏటా వార్డులోని ప్రజలంతా కలిసి ఐక్యంగా సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరుపుకుంటామన్నారు. చలువ పందిళ్లలో నెలకొలిపిన సీతారాముల విగ్రహాలను పట్టణంలోని వివిధ వార్డుల్లోని రామాలయాల్లో భద్రపరుచుకుని పండుగ నాటికి చలువ పందిళ్లకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వార్డులోనే 25 సంవత్సరాల నుంచి ఉన్న రచ్చబండపై చిన్నపాటి మందిరాన్ని సొంతంగా నిర్మించుకుని అందులో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎవరికి అడ్డుగా లేని రచ్చబండపై నిర్మించిన మందిరాన్ని తొలగిస్తామంటూ అధికారులు రావటం బాధాకరమన్నారు. రచ్చబండ అడ్డులేనప్పుడు మందిరం ఏ విధంగా అడ్డు వచ్చిందంటూ అధికారులను ప్రశ్నించారు. మందిరాన్ని తొలగించే ఆలోచనను విరమించుకోవాలని అధికారులను కోరారు.



మందిరాన్ని కూల్చొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

విలేకర్ల భద్రతకు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

రేపల్లె డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన విలేకరులు

రేపల్లె రూరల్: విలేకర్ల భద్రతకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, సాక్షి ఎడిటర్, ఇతర విలేకరులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ పలు పత్రికల విలేకర్లు రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పత్రికా విలేకరులు మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే విలేకర్ల భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చట్టాలను పటిష్టవంతంగా అమలు చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, దౌర్జన్యాలు, దోపిడీలను నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న పత్రికా విలేకర్లపై అక్రమ కేసులు బనాయించటం తగదన్నారు. ప్రజల పక్షాన నిలుస్తూ నిజాలను నిర్భయంగా ప్రకటిస్తున్న సాక్షి విలేకర్ల గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. విలేకర్ల భావ హక్కును హరించకుండా, విలేకర్లను బెదిరించినా, దాడులకు పాల్పడినా శిక్షార్హులవుతారని ఉన్నత న్యాయస్థానాలు చేసిన చట్టాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సాక్షి విలేకర్లపై బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొడ్డు మణివరకుమార్, శీలం సోమయ్య(భరత్), కుప్పల నాగప్రసాద్, పోలుబోయిన నాగబాబు, యార్లగడ్డ వెంకట రాంబాబు, జాలాది అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న వివిధ పత్రికల విలేకరులు

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

- ధూళిపూడిలో 30 పడకల వైద్యశాలకు రెండు సార్లు భూమి పూజ
- ఇప్పటి వరకు ప్రారంభం కాని పనులు
- సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ జరిగేనా అని ప్రజలలో పలు అనుమానాలు

నగరం: ధూళిపూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల వైద్యశాల (సామాజిక ఆరోగ్య కేంద్రం)గా రూపొందించేందుకు రెండు సార్లు ఒకసారి వైద్యారోగ్య శాఖ మంత్రి, మరోసారి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ భూమి పూజ చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల స్థానికులు పెదవి విరుస్తున్నారు. భూమి పూజ కార్యక్రమంలో ఆరు నెలల్లోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వైద్య సేవలు అందిస్తామని 2017 డిసెంబర్ 17వ తేదీన అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తర్వాత 2024 ఆగస్టు 23వ తేదీన ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ భూమి పూజ చేసి ఆరు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి 8 నెలలు గడిచినా ఒక్క ఇటుక కూడా వేయలేదు. కనీసం శంకుస్థాపన శిలాఫలకం కూడా కట్టలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 2017 నాటి శిలాఫలకం ఉత్సవ విగ్రహంలా వెక్కిరిస్తుంటే, 2024 నాటి శిలాఫలకం వైద్యశాలలో ఓ మూలన చేరింది. వైద్యశాల అప్‌గ్రేడ్ పనుల కోసం రెండు సార్లు శంకుస్థాపన చేయడం చర్చనీయాంశంగా మారింది.

ముందుగా సిబ్బందిని నియమించాలి

ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన జరిగి ఇప్పటికి 8 సంవత్సరాలు గడుస్తుంది. అయినా ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా పడలేదు. మంత్రులు శంకుస్థాపన చేస్తున్నారే తప్ప హామీ అమలు దిశగా పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ కావాలంటే ముందుగా సరిపడా వైద్యశాల సిబ్బంది నియామకం చేపట్టాలి. సీహెచ్‌సీకి అసిస్టెంట్ సివిల్ సర్జన్‌లు–8, దంత వైద్య నిపుణులు ఒకరు, ఒక హెడ్‌నర్స్, ఆరుగురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఇద్దరు ఫార్మసిస్ట్‌లు, ఒక జూనియర్ అసిస్టెంట్, నైట్ వాచ్‌మెన్‌లు, పారిశుద్ధ్య సిబ్బంది మొత్తం 31 మంది సిబ్బంది అవసరమున్నది. సీహెచ్‌సీకి ముందుగా స్టాఫ్‌ను నియమించాలి. కానీ అలాంటిది ఏమీ లేకుండానే భవన నిర్మాణ సముదాయానికి నిధులు కేటాయించి శంకుస్థాపనలతో సరిపెట్టడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఇప్పటికే నగరంలో...

నగరంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. రేపల్లె లోనూ సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఒకే మండలంలో రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. గత 8 సంవత్సరాలుగా ధూళిపూడి పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ చేయాలనే ఆశలు నేరవేరుతాయో లేదో అనే మీమాంస ప్రజానీకంలో ఉన్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సామాజిక ఆరోగ్య కేంద్రం భవన సముదాయ పనులు పూర్తి చేసి తగిన సిబ్బందిని నియమించి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దూళిపూడిలో 2017 నాటి శిలాఫలకం



పీహెచ్‌సీలో మూలన ఉన్న 2024 శిలాఫలకం

చర్యలు తీసుకుంటాం

గత పదిరోజులు క్రితమే పదవీ బాధ్యతలు చేపట్టాను. ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చేందుకు అవసరమైన అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్.మోజేష్, జిల్లా వైద్యశాల సమన్వయాధికారి

12 చలివేంద్రాలు ఏర్పాటు

తెనాలిఅర్బన్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు తెనాలి పట్టణంలోని ప్రధాన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ వేసవిలో ప్రతి సంవత్సరం పట్టణంలోని 12 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు రక్షక మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రాలు కొనసాగుతాయన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట రఘురామ్, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



తెనాలి: పట్టణ చినరావూరులోని శ్రీబాలాత్రిపురసుందరి సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీహనుమాన్ అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరుసగా 13వ సంవత్సరం జరిపిన వేడుకల్లో భాగంగా తొలుత అయ్యప్పస్వామికి గురుస్వామి గోలి సుందర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి భజనలు నిర్వహించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీహనుమాన్ అయ్యప్ప భక్తబృందం కమిటీ సభ్యులు నాగిశెట్టి నరసింహారావు, సనగోని బుచ్చయ్య, పి.పాపారావు, సోదరులు, అక్కల గోపికృష్ణ, అప్పికట్ల వినయ్ కుమార్, సోమరౌతు మధుబాబు, పెసర్లంక శీనుస్వామి, నీలా శరత్ బాబుస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

మరుప్రోలు శ్రీనివాసరెడ్డి S/o. రాజశేఖర్ రెడ్డి వయసు 24 సం॥ మరుప్రోలువారి గ్రామం, బాపట్ల మండలం, బాపట్ల జిల్లా. బాపట్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు తాలూకు దస్తావేజు నెం.1497/2007కు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఈ నెల 1-3-2025 నా వ్యక్తిగత పనుల నిమిత్తం మరుప్రోలు వారిపాలెం నుండి బాపట్లకు వెళ్తుండగా మార్గ మధ్యలో దస్తావేజు పోయినది. దొరికిన వారు పై అడ్రస్‌కు గానీ, బాపట్ల పోలీస్ స్టేషన్ నందు గానీ లేక ఈ క్రింది కాంటాక్టు నెంబర్‌కు తెలియచేయగలరు.

సెల్: 84999 17165